క్లుప్తంగా

పర్యావరణాన్ని కాపాడుదాం



శిక్షణ ఇస్తున్న ఎన్‌జీసీ అధికారులు

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): పర్యావరణాన్ని కాపాడాల్సిన బాధ్యత మనందరిపై ఉందని నేషనల్ గ్రీన్ కోర్ ప్రోగ్రాం అధికారి రాజశేఖర్ అన్నారు. జిల్లా పర్యవేక్షణలో భాగంగా గురువారం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఇందిరానగర్‌లో ఎల్‌ఈడీ ట్యూబ్‌లైట్ తయారీపై 50పాఠశాలల నుంచి 150విద్యార్థులు, ఉపాధ్యాయులకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. వర్మీకంపోస్ట్ తయారుచేసే విధానాన్ని నేర్పించి అనంతరం విద్యార్థులకు సర్టిఫికేట్‌లు అందించారు. జిల్లా సమన్వయకర్త భాస్కర్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

బీమాతో ఎన్నో ప్రయోజనాలు



చెక్కును అందజేస్తున్న అధికారులు

దౌల్తాబాద్ (దుబ్బాక): మండల పరిధిలో దొమ్మాటలో తపాలాశాఖ డాక్ కమ్యూనిటీ డెవలప్‌మెంట్ ప్రోగ్రామ్ నిర్వహించారు. గురువారం నిర్వహించిన ఈ కార్యక్రమంలో జిల్లా సూపరిండెంట్ శ్రీహరి పాల్గొని ప్రజలకు బీమా వల్ల కలిగే ప్రయోజనాల గురించి వివరించారు. అనంతరం అల్వాల గ్రామానికి చెందిన పుల్ల లావణ్య భర్త ప్రమాదవశాత్తు మరణించగా వారికి మంజూరైన రూ.30లక్షల బీమా చెక్‌ను ఆమెకు అందించారు. డివిజనల్ ఇన్‌స్పెక్టర్ కులకర్ని సందీప్, బ్రాంచ్ మేనేజర్ శ్రీనివాస్, నవీన్ కుమార్ రెడ్డి, వెంకట కృష్ణ, శంకర్, విజయ్, కరీంబేగ్ పాల్గొన్నారు.

అథ్లెటిక్స్‌లో విద్యార్థి ప్రతిభ

సిద్దిపేటఎడ్యుకేషన్: ఉస్మానియా యూనివర్సిటీలో జరిగిన సౌత్‌జోన్ జూనియర్ అథ్లెటిక్స్ పోటీల్లో డెకథ్లాన్‌లో సిద్దిపేట ప్రభుత్వ డిగ్రీ, పీజీ అటానమస్ కళాశాల విద్యార్థి లీలానంద్ 2,517 పాయింట్లు సాధించి ద్వితీయ స్థానంలో నిలిచాడు. ఈ సందర్భంగా గురువారం వైస్ ప్రిన్సిపాల్ అయోధ్యరెడ్డి, అధ్యాపకులు అతడిని సన్మానించారు. ఏటీ సులేమాన్, ఇన్‌చార్జి ఫిజికల్ డైరెక్టర్ విశ్వనాథం, అధ్యాపకులు శ్రద్ధానందం తదితరులు పాల్గొన్నారు.

'మహిళా శక్తి'తో ఆర్థికాభివృద్ధి



మాట్లాడుతున్న పీడీ ఆచార్య జయదేవ్

బెజ్జంకి(సిద్దిపేట): మహిళా శక్తి పథకంతో మహిళలు ఆర్థికాభివృద్ధి చెందాలని డీఆర్‌డీఓ పీడీ ఆచార్య జయదేవ్ సూచించారు. బెజ్జంకి రైతు వేదికలో గురువారం మహిళా సంఘాల అధ్యక్షులు, వీఓలకు అవగాహన సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో పాల్గొన్న ఆయన మట్లాడుతూ మహిళా శక్తి రుణాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో అదనపు పీడీ మధుసూదన్, ఎంపీడీఓ ప్రవీణ్, ఏపీఎం నర్సయ్య, సీసీలు సారయ్య, తిరుపతి, పద్మ, మండల అధ్యక్షురాలు పద్మ తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్‌కు అంతరాయం

సిద్దిపేటరూరల్/ప్రశాంత్‌నగర్(సిద్దిపేట)/కొముదవెల్లి(సిద్దిపేట): నూతన 33కేవీ లైన్ ఏబీస్విచ్ ఏర్పాటులో భాగంగా పనులు జరగనున్న కారణంగా సిద్దిపేటరూరల్, నారాయణరావుపేట మండలాలకు చెందిన నారాయణరావుపేట, లక్ష్మీదేవిపల్లి, ఇబ్రహీంపూర్, కోదండరావుపల్లి, బంజేరుపల్లి, చింతమడక, మాచాపూర్, అంకంపేట, సీతారాంపల్లి గ్రామాలకు శుక్రవారం ఉదయం 11 నుంచి 2వరకు విద్యుత్ నిలిపివేయనున్నట్లు ఏడీఈ శ్రీనివాసులు తెలిపారు. అలాగే ప్రశాంత్‌నగర్‌లో ఫీడర్‌ల మరమ్మతుల కారణంగా గాడిచర్లపల్లి పరిసర ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని సిద్దిపేట అసిస్టెంట్ డివిజనల్ ఇంజనీర్ సుధాకర్‌రెడ్డి తెలిపారు. అదేవిధంగా కొమురవెల్లి సబ్‌స్టేషన్ పరిధిలో మరమ్మతుల కారణంగా కొమురవెల్లి, అయినాపూర్, గౌరయపల్లి, కిష్టంపేట, రాంసాగర్ గ్రామాలలో త్రీ ఫేజ్ విద్యుత్ సరఫరా నిలిపివేసి, సింగిల్ ఫేజ్ సప్లయి కొనసాగిస్తామని ఏఈ మధు తెలిపారు.

రోడ్డు పక్కనే చెత్త కుప్పలు

చిన్నకోడూరు(సిద్దిపేట): మండల కేంద్రంలో స్వచ్ఛ భారత్ లక్ష్యం నెరవేరడం లేదు. పరిశుభ్రత, పారిశుద్ధ్యానికి ప్రాధాన్యం ఇస్తున్నామని చెబుతున్న అధికారులు క్షేత్రస్థాయిలో విఫలమవుతున్నారని పలువురు విమర్శిస్తున్నారు. నివాసాల నుంచి సేకరించిన చెత్త డంపింగ్ యార్డులకు చేరడం లేదు. చెత్తతో డంపింగ్ యార్డులో ఎరువులు తయారు చేయాల్సి ఉంది. కానీ పలు గ్రామాల్లో ఈ విధానం అటకెక్కింది. రోడ్ల పక్కనే చెత్త పారబోస్తున్నారు. అధికారులు స్పందించి చెత్త డంపింగ్ యార్డుకు తరలించేలా చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.



కొండపాక(గజ్వేల్): కుకునూరుపల్లిలో ఐలమ్మ విగ్రహాన్ని ఆవిష్కరించిన ఎమ్మెల్సీ



దుబ్బాకటౌన్: ఐలమ్మ విగ్రహానికి పూలమాల వేస్తున్న ఎంపీ రఘునందన్‌రావు



హుస్నాబాద్: నివాళులర్పిస్తున్న మున్సిపల్ చైర్మన్ రజిత తదితరులు



సిద్దిపేటఎడ్యుకేషన్: ఐలమ్మ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న డీఐఈఓ, ప్రిన్సిపాల్ తదితరులు

ఐలమ్మ ఆశయాలను కొనసాగిద్దాం

చాకలి ఐలమ్మ 129వ జయంతి సందర్భంగా గురువారం అన్ని మండలాల్లోను వేడుకలను ఘనంగా నిర్వహించారు. వివిధ పార్టీల నాయకులు ఆమె విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆమె ఆశయాలను కొనసాగించాలని పిలుపునిచ్చారు. దుబ్బాకలో ఐలమ్మ విగ్రహానికి ఎంపీ రఘునందన్‌రావు, ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్ రెడ్డి నివాళులర్పించారు. కొండపాక మండం కుకునూరుపల్లి, బందారం గ్రామాల్లో చాకలి ఐలమ్మ విగ్రహాలను ఎమ్మెల్సీ వంటేరు యాదవరెడ్డి ఆవిష్కరించారు. భూస్వాములకు వ్యతిరేకంగా పోరాటం చేసిన గొప్ప నారీమణి ఐలమ్మ అని పేర్కొన్నారు.



ములుగు(గజ్వేల్): ఐలమ్మ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న వీసీ నీరజ, అధికారులు

ఐలమ్మ స్ఫూర్తితో ముందుకు సాగాలి

- డీఐఈఓ రవీందర్‌రెడ్డి
- బాలికల కబడ్డీ పోటీలు ప్రారంభం

సిద్దిపేటఎడ్యుకేషన్: చాకలి ఐలమ్మ స్ఫూర్తితో విద్యార్థులు ముందుకు సాగాలని జిల్లా ఇంటర్ విద్యాధికారి(డీఐఈఓ) రవీందర్‌రెడ్డి పిలుపునిచ్చారు. ప్రభుత్వ జూనియర్ కళాశాలలో గురువారం ఐలమ్మ జయంతిని ఘనంగా నిర్వహించారు. ఆమె చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. డీఐఈఓ మాట్లాడుతూ బాలికలపై జరుగుతున్న దాడులను ఐలమ్మ పోరాట పటిమను ఆదర్శంగా తీసుకుని ధైర్యంగా ఎదిరించాలన్నారు. ఎస్‌జీఎఫ్ జిల్లా స్థాయి అండర్ 19 బాలికల కబడ్డీ పోటీలను ప్రారంభించారు. ప్రిన్సిపాల్ సత్యనారాయణరెడ్డి, స్టూడెంట్ కౌన్సిలర్ కనకచంద్రం, ఎస్‌జీఎఫ్ జిల్లా ఆర్గనైజింగ్ సెక్రటరీ సమ్మయ్య, అధ్యాపకులు దేవయ్య, సుధాకర్‌రెడ్డి, అశోక్ తదితరులు పాల్గొన్నారు.



హుస్నాబాద్‌రూరల్: మహ్మదాపూర్‌లో...



మద్దూరు(హుస్నాబాద్): వేడుకల్లో నాయకులు



జగదేవ్‌పూర్(గజ్వేల్): అలిరాజ్‌పేటలో..



ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): బీజేపీ నేతల నివాళి

పరిసరాలను శుభ్రంగా ఉంచుకోండి



అక్కన్నపేట(హుస్నాబాద్): మాట్లాడుతున్న డీపీఓ దేవకీదేవి

డీపీఓ దేవకీ దేవి

అక్కన్నపేట(హుస్నాబాద్)/హుస్నాబాద్‌రూరల్: బెజ్జంకి(సిద్దిపేట)/గజ్వేల్/హుస్నాబాద్/మద్దూరు(హుస్నాబాద్)/తొగుట(దుబ్బాక): ఇంటి పరిసరాలను నిత్యం పరిశుభ్రంగా ఉంచుకోవాలని డీపీఓ దేవకీ దేవి పిలుపునిచ్చారు. స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమంలో భాగంగా మండల కేంద్రంలో వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సీజనల్ వ్యాధులు ప్రబలకుండా చర్యలు తీసుకోవాలన్నారు. ప్రతి శుక్రవారం డ్రై డే ఫ్రైడే నిర్వహించి నిల్వ ఉన్న నీటిని తొలగించాలని, మురుగుకాలువలను ఎప్పటికప్పుడు శుభ్రం చేయించాలని సూచించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ భానోతు జయరాం, వైద్యాధికారులు రమ్య, వినీత్‌రెడ్డి, ఉపాధి హామీ ఏపీఓ ప్రభాకర్, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు. పంచాయతీ కార్మికులు ఆరోగ్యంగా ఉంటేనే గ్రామం ఆరోగ్యంగా ఉంటుందని దేవకీదేవి అన్నారు. హుస్నాబాద్ రూరల్ మండలంలోని పంచాయతీ కార్మికులకు వైద్య పరీక్షలు చేయించారు. ఎంపీడీఓ వేణుగోపాల్ రెడ్డి, ఎంపీఓ రమేశ్ పాల్గొన్నారు. పర్యావరణ పరిరక్షణలో ప్రతి ఒక్కరు భాగస్వాములు కావాలని సిద్దిపేట జెడ్పీ సీఈఓ రమేశ్, డీఆర్‌డీఓ ఆచార్య జయదేవ్ సూచించారు. మండలంలోని దాచారంలో నర్సరీ వద్ద శ్రమదానం చేశారు. అడిషనల్ పీడీ మధుసూదన్, ఎంపీడీఓ ప్రవీణ్, ఏపీఎం నర్సయ్య, సూపరింటిండెంట్ ఆంజనేయులు, మహిళా సంఘాల సభ్యులు, ఈజీఎస్ కూలీలు పాల్గొన్నారు. గజ్వేల్–ప్రజ్ఞాపూర్ మున్సిపల్ చైర్మన్ ఎన్‌సీ రాజమౌళి ఆధ్వర్యంలో మున్సిపల్ కార్యాలయం ఆవరణలో జరిగిన కార్యక్రమంలో భాగంగా పారిశుద్ధ్య సిబ్బందికి వైద్య పరీక్షలు చేయించి మందులను అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పట్టణాన్ని పరిశుభ్రంగా ఉంచడానికి పారిశుద్ధ్య సిబ్బంది చేస్తున్న కృషి వెలకట్టలేనిదన్నారు. మున్సిపల్ కమిషనర్ గోల్కొండ నర్సయ్య, వైస్ చైర్మన్ జకీయొద్దీన్ పాల్గొన్నారు. అలాగే హుస్నాబాద్ రెండో వార్డులోని బస్తీ దవాఖనలో పారిశుద్ధ్య కార్మికులకు వైద్య పరీక్షలను నిర్వహించారు. మున్సిపల్ చైర్మన్ రజిత మాట్లాడుతూ రెండు నెలలకు ఒక్కసారైనా ఆరోగ్య పరీక్షలు చేసుకోవాలన్నారు. మున్సిపల్ కమిషనర్ మల్లికార్జున్ గౌడ్, కౌన్సిలర్ రమాదేవి, వైద్యులు కృష్ణ, ప్రతిభ, అధికారులు ఎల్లం, రవికుమార్ తదితరులు పాల్గొన్నారు. మద్దూరు మండల ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ధర్మారం, గాగ్గిళ్లాపూర్, నర్సయపల్లి గ్రామాలకు చెందిన పంచాయతీ సిబ్బందికి మండల వైద్యాధికారి రజిత ఆధ్వర్యంలో వైద్య పరీక్షలు నిర్వహించారు. ఎంపీడీఓ రామ్మోహన్ మాట్లాడారు. పంచాయతీ కార్యదర్శులు వెంకటేశ్వర్లు, భాస్కర్, అశోక్ పాల్గొన్నారు. తొగుటలో 75మంది కార్మికులకు వైద్య పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. ఎంపీడీవో శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వం కార్మికులకు వైద్య పరీక్షలు నిర్వహించి మందులు అందజేస్తుందన్నారు. మండల వైద్యాధికారి రాధాకిషన్, సిబ్బంది పాల్గొన్నారు.



మద్దూరు(హుస్నాబాద్): పోషణ్ అభియాన్‌లో పాల్గొన్న సీడీపీఓ రమాదేవి తదితరులు

పిల్లలకు పౌష్టికాహారం తప్పనిసరి

సీడీపీఓ రమాదేవి

మద్దూరు(హుస్నాబాద్)/సిద్దిపేటజోన్/దుబ్బాక టౌన్: ఎదుగుతున్న పిల్లలకు పౌష్టికాహారం తప్పనిసరిగా అందించాల్సిన బాధ్యత తల్లిదండ్రులపై ఉందని చేర్యాల సీడీపీఓ రమాదేవి అన్నారు. మండలంలోని లద్నూరు గ్రామంలోని రైతువేదికలో గురువారం పోషణ్ అభియాన్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పోషకాహారంతోనే గర్భిణులు, బాలింతలు సంపూర్ణ ఆరోగ్యంగా ఉంటారన్నారు. అనంతరం పోషకాహారంపై గ్రామంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ రామ్మోహన్, పంచాయతీ కార్యదర్శులు వెంకటేశ్వర్లు, శ్రీనివాస్, భాస్కర్, అంగన్వాడీ సూపర్‌వైజర్ పుష్పలత, టీచర్లు ఎలిజబెత్, విజయ, మంజుల తదితరులు పాల్గొన్నారు. సిద్దిపేటజోన్ ఇందిరానగర్ అంగన్వాడీ కేంద్రంలో నిర్వహించిన కార్యక్రమంలో ఏసీడీపీఓ ఛాయాదేవి పాల్గొన్నారు. కౌన్సిలర్ కవిత, అంగన్వాడీ టీచర్లు వినోద, అహ్మద తదితరులు పాల్గొన్నారు. అదేవిధంగా దుబ్బాక రాయపోల్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో జరిగిన కార్యక్రమంలో మండల వైద్యాధికారి డాక్టర్ మహారాజ్ పాల్గొన్నారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రం సూపర్‌వైజర్ శ్రీనివాస్, ఐసీడీఎస్ సూపర్ వైజర్‌లు అనురాధ, షబానా, అంగన్వాడీ టీచర్‌లు పాల్గొన్నారు.

చట్టాల అమలుపై పోలీస్ డ్యూటీ మీట్

అడిషనల్ డీసీపీ మల్లారెడ్డి



మాట్లాడుతున్న అడిషనల్ డీసీపీ మల్లారెడ్డి

సిద్దిపేటకమాన్: చట్టాల అమలు, అంతర్గత భద్రత, నేరాలను శాస్త్రీయంగా గుర్తించడం, దర్యాప్తు చేయడం వంటి వాటి గురించి పోలీస్ డ్యూటీ మీట్ నిర్వహిస్తున్నట్లు అడిషనల్ డీసీపీ మల్లారెడ్డి చెప్పారు. పోలీసు కమిషనర్ కార్యాలయంలో పోలీసు అధికారులు, సిబ్బందికి గురువారం పోలీసు డ్యూటీ మీట్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అధికారులు, సిబ్బందికి కంప్యూటర్ పరిజ్ఞానంపై పరీక్ష నిర్వహించామన్నారు. ఉత్తమ ప్రతిభ కనబర్చిన వారికి జోన్ స్థాయి, రాష్ట్ర స్థాయికి ఎంపిక చేస్తారని చెప్పారు. అలాగే ఐలమ్మ చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. భూస్వాములకు వ్యతిరేకంగా దొరలపై పోరాడి ఎదురించిన వీరనారి అని ప్రశంశించారు. ఎస్‌బీ ఇన్‌స్పెక్టర్ శ్రీధర్‌గౌడ్, కంట్రోల్ రూమ్ సీఐ మల్లేశం గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

ముగ్గురిపై కేసు నమోదు

అక్కన్నపేట(హుస్నాబాద్): ఆర్టీసీ బస్సు డ్రైవర్, కండెక్టర్‌పై దాడి జరిగిన ఘటనలో ముగ్గురిపై కేసు నమోదు చేసినట్టు ఎస్‌ఐ విజయ్‌భాస్కర్ తెలిపారు. మండలంలోని రామవరంలో బుధవారం రాత్రి ఈ ఘటన చోటు చేసుకుంది. హైదరాబాద్ నుంచి రామవరం మీదుగా హుస్నాబాద్‌కు వస్తున్న బస్ రామవరంలో ఆగింది. ఈ క్రమంలో తమ ద్విచక్రవాహనాలకు సైడ్ ఇవ్వలేదని ముగ్గురు యువకులు బస్‌లో ప్రవేశించి దాడికి పాల్పడ్డారు. డ్రైవర్ ఫిర్యాదు చేసినట్టు ఎస్‌ఐ తెలిపారు.

మందుబాబులకు జరిమానా

సిద్దిపేటకమాన్: మద్యం తాగి వాహనాలు నడుపుతూ పట్టుబడిన వాహనదారులకు సిద్దిపేట కోర్టు జరిమానా విధించింది. ట్రాఫిక్ సీఐ ప్రవీణ్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. పట్టణంలోని తమ సిబ్బందితో కలిసి నాలుగు రోజుల క్రితం నిర్వహించినతనిఖీల్లో 17మంది పట్టుబడ్డారు. వారిని గురువారం సిద్దిపేట కోర్టులో హాజరుపర్చగా రూ.19,500 జరిమానా విధించినట్లు సీఐ తెలిపారు.

కబ్జాపై చర్యలు తీసుకోండి

గజ్వేల్‌రూరల్: రోడ్డును కబ్జాచేసి ప్రహరీ నిర్మించిన వారిపై చర్యలు తీసుకోవాలని గజ్వేల్–ప్రజ్ఞాపూర్ మున్సిపాలిటీ పరిధిలోని 6, 7వ వార్డులకు చెందిన పలువురు డిమాండ్ చేశారు. గురువారం మున్సిపల్ కమిషనర్ నర్సయ్యకు ఫిర్యాదు చేశారు.

కార్యదర్శులను సస్పెండ్ చేయడం సరికాదు



దుబ్బాకలో నిరసన వ్యక్తం చేస్తున్న కార్యదర్శులు

దుబ్బాకటౌన్/జగదేవ్‌పూర్(గజ్వేల్)/బెజ్జంకి(సిద్దిపేట)/దుబ్బాకరూరల్: నల్గొండ జిల్లాలో పనిచేస్తున్న పంచాయతీ కార్యదర్శులపై ఆడిట్ నివేదికలను సాకుగా చూపి కలెక్టర్ సస్పెండ్ చేయడం సరికాదని జిల్లా కార్యదర్శుల సంఘం అధ్యక్షుడు మురళీ వాపోయారు. సస్పెన్షన్‌ను నిరసిస్తూ దుబ్బాక ఎంపీడీఓ కార్యాలయం ఎదుట నల్ల బ్యాడ్జీలతో ఆందోళన చేశారు. కార్యక్రమంలో భాస్కర్ శర్మ, ఎంపీఓ నరేందర్ రెడ్డి, మండల కార్యదర్శులు పాల్గొన్నారు. జగదేవ్‌పూర్ మండల కార్యాలయం ఎదుట నిర్వహించిన నిరసన కార్యక్రమంలో టీపీఎస్‌ఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నాగరాజు మాట్లాడారు. సంఘం మండలాధ్యక్షుడు శైలేష్, సభ్యులు మల్లేశం, మమత, భాను, ప్రవీణ్, నరేశ్, ఐలయ్య, విక్రమ్, నవీన్, సాయిబాబా, కార్తీక్ తదితరులు పాల్గొన్నారు. బెజ్జంకి మండల పరిషత్ కార్యాలయం ఎంపీడీఓ ప్రవీణ్ ఆధ్వర్యంలో నల్లబ్యాడ్జీలతో నిరసన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో సూపరింటిండెంట్ ఆంజనేయులు, మండల పరిషత్ సిబ్బంది, గ్రామ కార్యదర్శులు పాల్గొన్నారు. దుబ్బాక మండల పంచాయతీ కార్యదర్శులు ఎంపీడీఓ కార్యాలయం ఎదుట నిరసన వ్యక్తం చేశారు.

బస్సు డ్రైవర్‌కు ఫిట్స్

- తప్పిన పెను ప్రమాదం

గజ్వేల్‌రూరల్: జీపీపీ ఆర్టీసీ డిపోలో అద్దె ప్రాతిపదికన కొనసాగుతున్న ఓ ప్రైవేటు బస్సు డ్రైవర్‌కు ఫిట్స్ రావడంతో అదుపు తప్పి పక్కనే ఉన్న వాహనాలను ఢీకొట్టాడు. ఈ ఘటన గజ్వేల్–ప్రజ్ఞాపూర్ మున్సిపాలిటీ పరిధిలో గురువారం చోటు చేసుకుంది. జీపీపీ ఆర్టీసీ డిపో మేనేజర్ పవన్, గజ్వేల్ సీఐ సైదా కథనం మేరకు.. అద్దె ప్రాతిపదికన నడుస్తున్న ఓ ప్రైవేటు బస్సులో డ్రైవర్ శివతోపాటు కండక్టర్ ఉన్నారు. వీరు తమ విధులను ముగించుకొని గజ్వేల్ నుంచి ప్రజ్ఞాపూర్ ఆర్టీసీ డిపోకు వెళ్తున్నారు. బస్సు కోర్టు సమీపంలోకి రాగానే డ్రైవర్ శివకు ఫిట్స్ వచ్చాయి. దీంతో బస్సు డివైడర్‌ను ఢీకొని ముందుకు వెళ్తా రోడ్డు పక్కనే ఉన్న ఓ కారు, ద్విచక్ర వాహనాలను స్వల్పంగా ఢీకొట్టింది. అనంతరం ఓ పానీపూరి బండివైపు దూసుకెళ్లి ఆగిపోయింది. ప్రమాదం జరిగినప్పుడు బస్సులో ఎవరూ లేకపోవడంతో పెనుప్రమాదం తప్పింది. వెంటనే అక్కడికి చేరుకున్న స్థానికులు, పోలీసులు శివను గజ్వేల్ ప్రభుత్వాస్పత్రికి తరలించారు. ఈ మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ సైదా తెలిపారు.

ఆయిల్ పామ్‌తో అధిక లాభాలు

మండల వ్యవసాయ అధికారి నరేశ్



అంతర పంటను పరిశీలిస్తున్న ఏఓ నరేశ్

దుబ్బాకటౌన్: రైతులు ఆయిల్ పామ్ సాగుతో అధిక ఆదాయం పొందవచ్చని మండల వ్యవసాయ అధికారి నరేశ్, ఫీల్డ్ ఆఫీసర్ ఆంజనేయులు సూచించారు. రాయపోల్ మండలం కొత్తపల్లిలో గురువారం ఆయిల్ పామ్ తోటలు, వాటిలో సాగుచేస్తున్న అంతర పంటలను పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నీటి యాజమాన్యాన్ని సరైన పద్ధతిలో పాటించడం వల్ల అధిక దిగుబడులు పొందవచ్చన్నారు. ఎకరానికి ప్రతి సంవత్సరం పది టన్నుల పామాయిల్ దిగుబడి పొందవచ్చని చెప్పారు. మూడు సంవత్సరాలు దాటిన తోటలకు చెట్టుకు 2.5కిలోల యూరియా, 3కిలోల సూపర్ ఫాస్పేట్, 2కిలోల పొటాష్ వేయాలని సూచించారు. జిల్లాలో ఇప్పటి వరకు 11వేల ఎకరాల్లో ఆయిల్ పామ్ సాగులో ఉందని, కొత్తగా సాగుచేసే రైతులకు 90శాతం సబ్సిడీ, ఎస్సీ, ఎస్టీ రైతులకు 100శాతం సబ్సిడీ ఇస్తున్నట్టు చెప్పారు. కార్యక్రమంలో ఏఈఓ రజిత, రైతు సాయికిరణ్ తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్త వార్తలు

◆ **ఫీజు రీయింబర్స్‌మెంట్ కోసం వినతి**

సిద్దిపేటరూరల్: జిల్లా వ్యాప్తంగా పెండింగ్‌లో ఉన్న స్కాలర్‌షిప్, రీయింబర్స్‌మెంట్ ఫీజు బకాయిలను ప్రభుత్వం వెంటనే విడుదల చేయాలని కోరుతూ యూఎస్‌ఎఫ్‌ఐ ఆధ్వర్యంలో కలెక్టరేట్ ఏఓకు గురువారం వినతి పత్రం అందించారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు రవి, మధు మాట్లాడారు. రీయింబర్స్‌మెంట్ రాకపోవడంతో కళాశాల యాజమాన్యాలు విద్యార్థులను ఇబ్బందులకు గురి చేస్తున్నారని వాపోయారు. రామస్వామి, వినయ్, శ్రావణ్, హేమంత్ పాల్గొన్నారు.

◆ **ప్రారంభమైన ఎస్‌జీఎఫ్ క్రీడా పోటీలు**

గజ్వేల్‌రూరల్: పట్టణంలోని సాయి జీడీఆర్ పాఠశాలలో గురువారం ఎస్‌జీఎఫ్ క్రీడా పోటీలు ప్రారంభమైనట్లు మండల ఎస్‌జీఎఫ్ సెక్రటరీ భవాని తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మొదటి రోజు అండర్–14, అండర్–17 బాలుర విభాగంలో కబడ్డీ, ఖోఖో, వాలీబాల్ పోటీలు నిర్వహించినట్టు చెప్పారు. కార్యక్రమంలో పీడీలు రవి, విజయరేఖ, నాగేష్, విశాల, ప్రశాంత్, భవిత, పీఈటీలు పాల్గొన్నారు.

◆ **ప్రతి తరగతికి ఒక టీచర్ ఉండాలి**

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): ప్రతి తరగతికీ ఒక ఉపాధ్యాయుడు ఉండేలా అధికారులు చర్యలు తీసుకోవాలని టీపీటీఎఫ్ నాయకులు కోరారు. జీవో నంబర్ 25ను వెంటనే సవరించాలని కోరుతూ గురువారం జిల్లా విద్యాశాఖ అధికారి శ్రీనివాస్‌రెడ్డికి వినతిపత్రం అందించారు. రాష్ట్ర నాయకుడు తిరుపతిరెడ్డి, జిల్లా అధ్యక్షుడు విజయేందర్ రెడ్డి, ప్రధాన కార్యదర్శి తిరుపతి మాట్లాడారు. ప్రతి 20మంది విద్యార్థులకు ఒక ఉపాధ్యాయుణ్ణి కేటాయించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో జానకి రాములు, నర్సింహారెడ్డి, నరేందర్, శివాజీ, సత్యకృష్ణ, మల్లేశం, రాంచంద్రం తదితరులు పాల్గొన్నారు.

◆ **సంక్షేమాన్ని విస్మరిస్తున్న ప్రభుత్వం**

గజ్వేల్‌రూరల్: ముదిరాజ్‌ల సంక్షేమాన్ని కాంగ్రెస్ ప్రభుత్వం విస్మరించిందని ముదిరాజ్ మహాసభ రాష్ట్ర ఉపాధ్యక్షుడు కొట్టాల యాదగిరి ముదిరాజ్ వాపోయారు. గురువారం ఆయన గజ్వేల్‌లో మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా 26,357 చిన్ననీటి వనరులుండగా గత బీఆర్‌ఎస్ ప్రభుత్వం రూ.100 కోట్లు కేటాయించి నాణ్యమైన చేప పిల్లలను పంపిణీ చేసిందని, కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి టెండర్ల పేరిట కాలయాపన చేయడమే తప్ప ముదిరాజ్‌ల సంక్షేమాన్ని పట్టించుకున్న పాపానపోలేదన్నారు. నర్సింహులు, భాస్కర్, మనోహర్, రమేశ్, చంద్రం, సత్యనారాయణ, వెంకటేశ్, నాగరాజు పాల్గొన్నారు.

◆ **పాప ప్రక్షాళనకు పూజలు చేయాలి**



సిద్దిపేటఅర్బన్: తిరుమల లడ్డూ తయారీలో వాడిన నెయ్యి కల్తీ జరిగిందంటూ అబద్ధపు ప్రచారంచేసి ఏపీ సీఎం చంద్రబాబు నాయుడు తిరుమలను అపవిత్రం చేశారని, దీనికి పరిహారంగా పాప ప్రక్షాళన కోసం శనివారం ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించాలని ఆర్యవైశ్య మహాసభ రాష్ట్ర ఉపాధ్యక్షుడు తడక జగదీశ్వర్ గుప్తా పిలుపునిచ్చారు. గురువారం ఆయన మాట్లాడుతూ వెంకటేశ్వరస్వామి వైభవాన్ని, టీటీడీ పేరు ప్రఖ్యాతులను, భక్తుల మనోభావాలను కించపరిచేలా సీఎం చంద్రబాబు వ్యవహరించడం బాధాకరమన్నారు.

◆ **నేడు చేర్యాలలో మంత్రి పర్యటన**

చేర్యాల(సిద్దిపేట): చేర్యాలలో మంత్రి కొండా సురేఖ శుక్రవారం పర్యటించనున్నారు. లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులు పంపిణీ చేయనున్నారు. ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్ రెడ్డి, ఎంపీ కిరణ్‌కుమార్‌రెడ్డి పాల్గొంటారు.

◆ **ఎంఈఓల బాధ్యతలు స్వీకరణ**

కోహెడ(హుస్నాబాద్)/చేర్యాల(సిద్దిపేట): జిల్లా వ్యాప్తంగా అన్ని మండలాలకు నూతన ఎంఈఓలను నియమించారు. అందులో భాగంగా కోహెడ మండల ఇన్‌చార్జి విద్యాధికారిగా ఆర్.పద్మయ్య, చేర్యాల ఎంఈఓగా రచ్చ కిష్టయ్య గురువారం బాధ్యతలు స్వీకరించారు.

◆ **బ్యాంక్ ఎదుట రైతుల ఆందోళన**

బెజ్జంకి(సిద్దిపేట): రుణమాఫీ కాని రైతులు మండలంలోని తోటపల్లిలోని ఇండియన్ బ్యాంక్ ఎదుట గురువారం ఆందోళన చేశారు. బ్యాంకులోకి వెళ్లి రుణమాఫీ అయ్యే వరకు విధులు నిర్వర్తించవద్దని అంతరాయం కలిగించారు. విషయం తెలుసుకున్న బెజ్జంకి ఎస్‌ఐ కృష్ణారెడ్డి రైతులతో మాట్లాడారు. దీంతో రైతులు శాంతించి సోమవారం కలెక్టర్‌కు ఫిర్యాదు చేస్తామని వెళ్లిపోయారు.

◆ **మాజీ ఎంపీపీ మృతి**

నంగునూరు(సిద్దిపేట): నంగునూరు మాజీ ఎంపీపీ లింగంపల్లి లచ్చవ్వ శుక్రవారం అనారోగ్యంతో మృతి చెందారు. నర్మేటకు చెందిన ఆమె 1995లో జరిగిన ఎంపీటీసీ ఎన్నికల్లో ఎస్సీ కోటాలో గెలుపొందారు. కేసీఆర్ నేతృత్వంలో నంగునూరు జనరల్ స్థానానికి ఎంపీపీగా ఎన్నికయ్యారు. ఐదు సంవత్సరాల పాటు మండల అభివృద్ధికి కృషి చేశారు.